క్లుప్తంగా

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్

నర్సీపట్నం: బాలికల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని, వాటిపై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలకు దూరంగా ఉండాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. సదస్సులో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మధుసూదన్‌రావు, న్యాయవాది వాసవీ దత్తా పాల్గొన్నారు.

రూ.35 కోట్లతో ఉపాధి పనులు



తామరంలో మ్యాపు ద్వారా పనులను వివరిస్తున్న ఏపీవో

మాకవరపాలెం: వచ్చే ఏడాది మండల వ్యాప్తంగా రూ.35 కోట్లతో ఉపాధి పనులు చేపట్టనున్నట్టు ఏపీవో వరలక్ష్మి తెలిపారు. మండలంలోని తూటిపాల, అప్పన్నదొరపాలెం, తామరం గ్రామాల్లో సోమవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే కొత్త పనులను ఇప్పటికే గుర్తించామన్నారు. వీటిని ప్రజలకు వివరించి ఆమోదం తీసుకున్నారు. ప్రతి కూలీకి వంద రోజులు పనులు కల్పించేందుకు చర్యలు చేపట్టామన్నారు. తూర్పుకాపు సంఘ మండల అధ్యక్షుడు హరిబాబు, సర్పంచులు చెల్లారత్నం, గవిరెడ్డి ప్రసాద్, ఉపాధి టెక్నికల్ సిబ్బంది, ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేయాలి

డిప్యూటీ డీఈవో అప్పారావు

నర్సీపట్నం: ఉపాధ్యాయులు అంకితం భావంతో పని చేయాలని డిప్యూటీ డీఈవో ఎం.అప్పారావు సూచించారు. ఎంఈవోలు, హెచ్ఎంలకు అభ్యసనాభివృద్ధిపై జరుగుతున్న శిక్షణ తరగతులను సోమవారం ఆయన పరిశీలించారు. పాఠ్యాంశాలపై సమగ్ర ప్రణాళిక తయారు చేసుకుని విద్యార్థులకు బోధించాలన్నారు. బోధన సమర్థవంతంగా అమలు చేసిన బాధ్యత స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలపై ఉందన్నారు. అనంతరం ఆయన్ను పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోపినాథ్, ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు



కార్తీక మాసం పవిత్ర పూజల్లో భాగంగా నందీశ్వరునికి పూజలుచేస్తున్న భక్తులు

చోడవరం: పవిత్ర కార్తీకమాసంలో మొదటి సోమవారం నాడు ఒక పక్క భక్తుల రద్దీతో శివాలయాలు, మరోపక్క వనభోజనాలతో పిక్నిక్ స్పాట్‌లు సందడిగా మారాయి. చోడవరం పట్టణంలో స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయం కిటకిటలాడింది. స్వామి వారికి వెండి నాగాభరణంతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. నాలుగడుగుల ఎత్తు ఉన్న ఈ వెండి నాగాభరణాన్ని మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు సమకూర్చారు. పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు ప్రసాదం, మజ్జిగ, మంచినీరు ప్యాకెట్లు పంపిణీ చేశాయి. ముద్దుర్తి సంగమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నదుల సంగమంలో భక్తులు పవిత్రస్నానాలు ఆచరించారు. వెంకన్నపాలెం సాయిబాబు ఆలయం ప్రాంగణం వనభోజనాలకు వచ్చిన జనంతో సందడిగా మారింది. మాడుగుల, నర్సీపట్నం నియోజకవర్గాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



అన్ని రోగాలకు ఒకే రకం గోళీలు ఇస్తున్నారు.. డాక్టరు ఎప్పుడొస్తారో తెలియదు. ఎప్పుడెళ్లినా ఏఎన్‌ఎం తనిఖీ చేస్తున్నారు. ఎక్స్‌రేకు, స్కానింగ్‌కు బయటకు పంపిస్తున్నారు. ఇలాంటి ఎన్నో అపవాదులు మూటగట్టుకున్న ప్రభుత్వ ఆస్పత్రులకు వైఎస్సార్‌సీపీలో అధికారంలోకి వచ్చాక ఒక్కసారిగా ఆదరణ పెరిగింది. రోజు రోజుకూ రోగుల తాకిడి పెరుగుతోంది. కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు ఉచితంగా అందుతుడటంతో పట్టణాల్లో ప్రైవేటు హాస్పిటల్‌కు వెళ్లే వారు సైతం వరుస కడుతున్నారు. ఈ నేపథ్యంలో 30 నుంచి 50 పడకల స్థాయికి కె.కోటపాడు సామాజిక ఆస్పత్రిని పెంచారు.



కె.కోటపాడు సీహెచ్‌సీలో చివరి దశకు చేరుకున్న అదనపు భవన నిర్మాణం

పేదల పాలిట సంజీవని



- కె.కోటపాడు సీహెచ్‌సీకి పెరుగుతున్న రోగుల సంఖ్య
- 11 రకాల స్పెషలిస్టు వైద్యులతో సేవలు
- అందుబాటులోకి వచ్చిన కార్పొరేట్ స్థాయి వైద్యం
- సీఎం జగన్ హామీ మేరకు 30 నుంచి 50 పడకలకు పెంపు
- రూ.5.60 కోట్లతో అదనపు భవనాలు

కె.కోటపాడు: స్థానిక సీహెచ్‌సీలో నాలుగు మండలాల ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందుతున్నాయి. గతంలో ప్రజా సంకల్ప యాత్ర సమయంలో అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత సీఎం ఇక్కడ బహిరంగ సభలో అధికారంలోకి వచ్చిన వెంటనే 50 పడకల ఆస్పత్రిగా మార్చుతామని ప్రకటించారు. ఆ ప్రకారం అదనపు భవనాలు, మౌలిక వసతుల కల్పనకు రూ.5.60 కోట్లు మంజూరు చేశారు. దాంతో ఈ పనులు చివరి దశకు చేరుకున్నాయి. త్వరలోనే అదనపు వసతులతో కూడిన భవనం ప్రారంభోత్సవం కానుంది. ఈ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను ఎప్పటికప్పుడు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పర్యవేక్షిస్తున్నారు.

పెరిగిన రోగుల తాకిడి

గతంలో చిన్నపాటి జ్వరం వచ్చినా స్థానికంగా ఆర్‌ఎంపీ లేదా ప్రైవేటు క్లినిక్‌లను ఆశ్రయించేవారు. దాంతో రోజూ 200 మంది రోగులు మాత్రమే వైద్య సేవలు పొందేందుకు వచ్చేవారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్యరంగానికి పెదపీట వేయడంతో ప్రస్తుతం అన్ని రకాల వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందుతుండటంతో 350 మందికిపైగా నిత్యం వస్తున్నారు.

సురక్ష ప్రసవాలు...

వైద్య సిబ్బంది నిత్యం గ్రామాల్లో గర్భిణులకు అవగాహన కల్పిస్తుండటంతో ప్రసవాల సంఖ్య పెరుగుతోంది. గతంలో అరకొరగా ప్రసవాలు ఉండేవి. ప్రస్తుతం ప్రతి నెలా 50కు పైగా గర్భిణులు ప్రసవాలు పొందుతున్నారు. సుఖ ప్రసవం సాధ్యం కాని పక్షంలో అత్యవసర పరిస్థితిలో శస్త్రచికిత్స ద్వారా వైద్య సిబ్బంది చేస్తున్నారు.

72 రకాల వ్యాధి నిర్ధారిత పరీక్షలు

సీహెచ్‌సీలో వ్యాధి నిర్ధారిత పరీక్షలకు అత్యాధునిక పరికరాలను సమకూర్చారు. దీంతో స్థానికంగానే 72 రకాల వ్యాధి నిర్ధారిత పరీక్షలు చేస్తున్నారు. వీటిలో సీబీపీ(ప్లేట్ లేట్ కౌంట్), ఆర్‌ఎఫ్‌టీ(కిడ్నీ పరీక్షలు), ఎల్‌ఎఫ్‌టీ(లివర్ ఫంక్షన్ పరీక్ష), లిపిడ్ ప్రొఫైల్(గుండె సంబంధిత) పరీక్ష, ఎక్స్‌రేలను నిర్వహిస్తున్నారు.

పెరిగిన వైద్య సిబ్బంది

గత ప్రభుత్వంలో ఇక్కడ ఆస్పత్రిలో ఐదుగురు వైద్యులు మాత్రమే అందుబాటులో ఉండేవారు. ప్రస్తుతం ఆస్పత్రి స్థాయిని పెంచిన నేపథ్యంలో గైనిక్–2, జనరల్ సర్జన్–2, అనస్థీషియా, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, చిల్డ్రన్ స్పెషలిస్టు, ఎంబీఎస్‌యూ, ఎన్‌సీడీ, ఆప్తాలమిస్ట్, తదితర 11 మంది స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులోకి వచ్చారు. వీరితో పాటు నర్సింగ్ స్టాఫ్ గతంలో పది మంది ఉండగా, నేడు 18 మంది వైద్య సేవలందిస్తున్నారు.

వైద్య సేవలు పొందుతున్న మండలాలు

కె.కోటపాడు సీహెచ్‌సీలో వైద్యం సేవల కోసం కె.కోటపాడుతోపాటు సమీప దేవరాపల్లి, చీడికాడ, విజయనగరం జిల్లా వేపాడ మండలాల నుంచి రోజూ వందలాది రోగులు వస్తుంటారు.





ఆస్పత్రిలో డిజిటల్ ఎక్స్‌రే యూనిట్

పైసా ఖర్చు లేకుండా వైద్యం



ఇంటి వద్ద పని చేస్తుండగా చేతికి దెబ్బతగిలింది. దీంతో చేతితో పని చేసేందుకు ఇబ్బంది ఉండేది. ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమత లేకపోవడంతో కె.కోటపాడు సీహెచ్‌సీకి వచ్చాను. ఆర్థోపెడిక్ డాక్టరు నన్ను పరీక్షించారు. ఉచితంగా ఎక్స్‌రే తీశారు. మందులు కూడా ఇచ్చారు. ఇంత మెరుగైన వైద్యం అందుబాటులోకి వచ్చినందుకు ఆనందంగా ఉంది.

– ఎస్.అప్పలనర్సమ్మ, వ్యాధిగ్రస్తురాలు, కొరువాడ గ్రామం

24 గంటలూ అందుబాటులో వైద్య సిబ్బంది



సామాజిక ఆస్పత్రిలో 24 గంటలూ వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. ఆస్పత్రికి వచ్చిన రోగి పరిస్థితిని బట్టి సంబంధిత వైద్యుడితో ట్రీట్‌మెంట్ ఇప్పిస్తున్నాం. ఇక్కడ నాణ్యమైన వైద్య సేవలందిస్తున్నాం. సీరియస్ కేసులు ఉంటే, అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి, కేజీహెచ్‌కు రిఫర్ చేస్తున్నాం.

– శ్రీలక్ష్మి, ఆస్పత్రి సూపరింటెండెంట్, కె.కోటపాడు



రకాల పరీక్షలకు సంబంధించి పరికరాలు



నాడు కె.కోటపాడు 30 పడకల ఆస్పత్రి



పరిశుభ్రంగా లేబర్ రూమ్

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం డివిజన్ స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ వారం స్పందనకు 12 అర్జీలు వచ్చాయి. వీటిలో ఎక్కువగా భూసమస్యలు ఉన్నాయి. సీడీపీవో మేరీ సువార్త, తహసీల్దార్ అన్నాజీరావు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

నర్సీపట్నం: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం అని ఆర్డీవో హెచ్.వి.జయరాం పేర్కొన్నారు. స్థానిక ఏబీఎం కళాశాలలో ఓటర్ల నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన విద్యార్థులు విధిగా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. తహసీల్దార్ అన్నాజీరావు, ఎలక్షన్ డీటీ సుధావాణి, ఈఆర్వో, ఏఈఆర్వోలు, ప్రిన్సిపాల్ గిరిబాబు పాల్గొన్నారు.

తిరుపతి వేంకటేశ్వరుని సేవలో ఎమ్మెల్యే గణేష్



నర్సీపట్నం: ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తన జన్మదిన వేడుకలను కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతిలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ఆయన సతీమణి కళావతి, కుమారులు విజయ అభినాష్, ఆదర్స్ పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యే గణేష్ జన్మదిన కేక్ కట్ చేస్తున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి



గొలుగొండలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

నర్సీపట్నం/మాకవరపాలెం/గొలుగొండ:ఎమ్మెల్యే గణేష్ జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. నర్సీపట్నంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి. సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, పార్టీ అధ్యక్షుడు ఏకా శివ జన్మదిన కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఏరియా ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పార్టీ టౌన్ మహిళా అధ్యక్షురాలు బయపురెడ్డి గణమ్మ, అయ్యరక కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కర్రి కనకమహాలక్ష్మి, కోఆప్షన్ సభ్యురాలు షేక్ రోజా, ఏఎంసీ వైస్ చైర్మన్ మళ్ల గణేష్ పాల్గొన్నారు.

మాకవరపాలెం పీహెచ్‌సీ రోగులకు పండ్లు, మిఠాయిలు పంచిపెట్టారు. పార్టీ మండల అధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి బొడ్డు గోవిందరావు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పెట్ల భద్రాచలం, వైస్ ఎంపీపీ రాజారావు, సచివాలయ మండల కన్వీనర్ రమణ పాల్గొన్నారు.

గొలుగొండ పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. ఎంపీపీ మణికుమారి, జెడ్పీటీసీ గిరిబాబు, పార్టీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, యూత్ విభాగం మండలాధ్యక్షుడు రామకృష్ణనాయుడు, సర్పంచ్ బుజ్జి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా సీఎం జగన్ పాలన

- ఏపీ కి నీడ్స్ జగన్ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



నిండగొండలో ఇంటింటా తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

రోలుగుంట: అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి పాలన అందిస్తున్నారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ శెట్టి సంధ్య ఆధ్వర్యంలో సోమవారం నిండుగొండలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ ధర్మశ్రీ మాట్లాడుతూ సచివాలయ పరిధిలో అభివృద్ధి పనులకు రూ.18.45 లక్షలు, సంక్షేమ పథకాలకు రూ. 21 లక్షలు ప్రభుత్వం ఖర్చు చేసిందని వివరించారు. దీనికి ముందు అభివృద్ధి పనులకు సంబంధించిన డిస్‌ప్లేను ఆవిష్కరించారు. అనంతరం పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమాల గురించి ప్రజలకు వివరించారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొర్లె వెంకటరమణ, మండల నాయకులు పోతల లక్ష్మీ శ్రీనివాస్, ఉలబాల రాము, కర్రి రాము, శెట్టి వెంకటరాజారావు పోతల రాజశేఖర్, పాచిలి రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి చిరంజీవి పాల్గొన్నారు.

నర్సీపట్నం: సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు వివరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి కోరారు. పాత మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సంక్షేమం, ప్రగతి బోర్డులను ఆవిష్కరించారు. పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, మున్సిపల్ సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, మున్సిపల్ కమిషనర్ పూడి రవిబాబు పాల్గొన్నారు.



కాశీపురంలో కరపత్రాలను అందజేస్తున్న అప్పారావు, జెడ్పీటీసీ కర్రి సత్యం

అమలాపురంలో...

అమలాపురంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే బ్రోచర్లను ఎంపీపీ సుర్ల రాజేశ్వరి ఆవిష్కరించారు. సర్పంచ్ శెట్టి అచ్చిరాజు, పార్టీ మండలాధ్యక్షుడు సుర్ల సత్యనారాయణ, సచివాలయాల మండల కన్వీనర్ శానాపతి వెంటకరత్నం, ఎంఎల్‌వో సుర్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

దేవరాపల్లి: కాశీపురంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిశీలకుడు ఉరుకూటి అప్పారావు మాట్లాడుతూ సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాలకు రూ.16.30 కోట్లు, అభివృద్ధికి రూ.1.90 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, యువజన విభాగం మండలాఅధ్యక్షుడు కర్రి సూరినాయుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి దాసరి గోపి, ఉగ్రూకుల అప్పారావు పాల్గొన్నారు.

గొలుగొండ: ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటేలో భాగంగా చోద్యంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ, అభివృద్ధి గురించి జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, పార్టీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ వివరించారు. వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి, రాష్ట్ర శెట్టిబలిజ సంఘం డైరెక్టర్ బొందల రాజు పాల్గొన్నారు.

కె.కోటపాడు: గుల్లేపల్లిలో సంక్షేమ, అభివృద్ధి వివరాలను తెలిపే బోర్డును ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ ఆవిష్కరించారు. వీటికి సంబంధించి ప్రజలకు వివరించారు. సర్పంచ్ బండారు దేముళ్లు, జేసీఎస్ కన్వీనర్ ఏటుకూరి రాజేష్, ఎంపీడీవో ప్రసాద్ పాల్గొన్నారు.

నాతవరం: స్థానిక గ్రామ సచివాలయం –2లో రూ.20.95 కోట్లు సంక్షేమ, అభివృద్ధికి వెచ్చించామని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి తెలిపారు. వీటికి సంబంధించిన బోర్డును గ్రామ సచివాలయం –2లో ఆవిష్కరించారు. జెడ్పీటీసీ కాపారపు అప్పలనర్స, వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి, సర్పంచ్ గోలగాని రాణి, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, ఎంపీటీసీలు శ్రీను పాల్గొన్నారు.



దిబ్బిడిలో సంక్షేమ పథకాల జాబితా చార్టును ప్రారంభించిన జెడ్పీటీసీ

బుచ్చెయ్యపేట: దిబ్బిడిలో అభివృద్ధి, సంక్షేమ వివరాల చార్టును జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి ఆవిష్కరించారు. వైఎస్ ఎంపీపీలు గొంపా చినబాబు, దొండా నారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి జోగా కొండబాబు, సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం, మాజీ సర్పంచ్ గొంపా అప్పారావు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: ఎం. కోటపాడులో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయ పరిధిలో రూ.26 కోట్ల సంక్షేమ, అభివృద్ధి జరిగిందని మాడుగుల ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు తెలిపారు. ఉప సర్పంచ్ శానాపతి గంగాధర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు తాళ్లపురెడ్డి రాజారామ్, ఎం.కె.వల్లాపురం సర్పంచ్ కోట్ని లక్ష్మి, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చీడికాడ: ఏపీ కి నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా అర్జునగిరిలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు లాలం శారదావరలక్ష్మి, సర్పంచ్‌లు బోడాల రమాదేవి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

మాకవరపాలెం: పి.పి.అగ్రహారంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇన్‌చార్జి ఎంపీడీవో సీతామహాలక్ష్మితో కలిసి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్ వివరించారు. వీటికి సంబంధించి ఫ్లెక్సీని సచివాలయం వద్ద ఆవిష్కరించారు. సచివాలయ మండల కన్వీనర్ చిటికెల రమణ పాల్గొన్నారు.

పుస్తక ప్రాధాన్యత తగ్గలేదు



కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న తహసీల్దార్ అన్నాజీరావు



విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి ఎంఈవో వరహాలబాబు

నర్సీపట్నం/రావికమతం/మాడుగుల/మాడుగుల రూరల్/కె.కోటపాడు/నాతవరం: శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం ఎంత పెరిగినా, ఇప్పటికీ పుస్తకం ప్రాధాన్యం ఏమాత్రం తగ్గలేదని వక్తలు అన్నారు. వారం రోజులుగా నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు బహుమతులు ప్రదానం చేశారు. నర్సీపట్నం శాఖా గ్రంథాలయంలో తహసీల్దార్ సిహెచ్. అన్నాజీరావు, ఎంఈవో సిహెచ్. తలుపులు, జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.త్రిమూర్తులరెడ్డి పాల్గొన్నారు. నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ వేడుక నిర్వహించారు. నాతవరంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, ఎంఈవో వరహాలబాబు బహుమతులు ప్రదానం చేశారు. మాడుగుల గ్రంథాలయంలో ప్రతిభ కనబరిచిన 30 మంది విద్యార్థులకు ఎంపీపీ వేమవరపు రామధర్మజ బహుమతులు అందజేశారు. కె.జె.పురం, కె.కోటపాడు మండలం చౌడువాడ గ్రంథాయాల్లో ముగింపు కార్యక్రమం జరిగింది.

రైతుల్లో కలవరం

కె.కోటపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో వరి కోత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ తరుణంలో వాతావరణంలో వచ్చిన మార్పులతో ఆకాశం మేఘావృతమై ఉండటంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. చేతికందివచ్చిన పంటకు నష్టం కలగకుండా తాత్కాలికంగా కోసిన పంటను మడుల్లోనే కుప్పలుగా పెడుతున్నారు.